


# బీహార్ దంగల్

## BIHAR ELECTION FIGHT

## కుల సమీకరణాలే కీలకం

### గెలుపు వైపే.. నితీష్..
### 20 ఏళ్ళుగా కుర్చీ వదలని మాంత్రికుడు
### యువతరం ఛాయిస్ తేజస్వీ
### దేశ రాజకీయాల్లో ఆసక్తిని కలిగిస్తున్న బీహార్

(మహా ప్రత్యేకం)

బీహార్ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికలు ఒక్క బీహార్ ప్రభుత్వాన్నే కాదు.. భారత ప్రభుత్వాన్ని కూడా శాసించగల ఎన్నికగా అత్యంత ప్రముఖమైనవి. ప్రధానమైనవి. బీహార్ లో పోటీ ప్రధానంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండీ కూటమి మధ్యే ఉండనుంది. ఈ రెండు కూటముల బలాబలాలేంటి? విజయావకాశాలు ఎంత? పార్టీలకు ఎదురవుతున్న సవాళ్లేంటి తదితర అంశాలపై చర్చోపచర్చలు సహజంగా జరుగుతాయి. అయితే ఈ సారి ఈ చర్చలు బీహార్ ను దాటి దేశమంతా జరుగుతున్నాయి. ఇందుకు కారణం.. కేంద్రంలోని మోదీ సర్కార్ నితీష్ బలం మీద నిలబడడమే. అంటే ఒకరకంగా బీహార్ లో తేడా వస్తే.. ఢిల్లీ కూడా షేక్ అయ్యే ఛాన్స్ లు ఉన్నాయని ఆశావాదుల అంచనా. రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చు. బీహార్ రాజకీయాల స్టైలే వేరు. అక్కడి ప్రజలు కూడా రాజకీయాలపై అత్యంత ఆసక్తి కనబరుస్తారు. రాజకీయ చాణక్యం.. చైతన్యం బీహారీలలో అధికం. బీహారీలకు రాజకీయమే అత్యంత ఆసక్తికర అంశం. నితీశ్ కుమార్ ఎక్కడుంటే అధికారం అక్కడేనని గడిచిన రెండు దశాబ్దాలలో బీహార్‌లో ఒక కొత్త నినాదం వ్యాప్తిలో ఉంది. గతంలోనూ సమోసాలో ఆలూ ఉన్నంతకాలం.. బీహార్ లో లాలూ ఉంటాడని లాలూ ప్రసాద్ యాదవ్ హవా నడిచిన కాలంలో ప్రకటించుకున్నాడు. కానీ తర్వాత తేడావచ్చింది. ఇపుడు నితీశ్ తో అంటకాగాలని అన్నిరాజకీయపార్టీలు రహస్యంగా కోరుకుంటాయి. లాలూ 2022లో నితీశ్‌తో చేతులు కలపడానికి ఇదే కారణం. 2017లో చీలిక చేదును మిగిల్చినా లాలూ దాన్ని దిగ మింగుకోవాల్సి వచ్చింది. మహాఘట్ బంధన్ రెండు విడతల హయాంలో నితీశ్‌తో ఎన్నడూ పొత్తు పెట్టుకోమని బీజేపీ నాయ కులు బాహాటంగా చెప్పినా మళ్ళీ కలిసి పోటీచేస్తున్నారు. ఇటు నితీష్, అటు బిజెపి సీట్లు సరి సమానంగా పంచుకోనున్నాయి. ఎన్నికలన్నాక.. పొత్తులు, సీట్ల జగడాలు మామూలే.

**నితీశ్ టక్కుటమారి**

బీహార్‌లో ఎన్నికల విజయాన్ని సొంతం చేసుకోవడం నితీష్ కు వెన్నతో పెట్టిన విద్యలా మారింది. 2005లో బీహార్ సీఎం అయినపుడు తన శక్తి యుక్తులన్నింటినీ శాంతి భద్రతల నిర్వహణపై కేంద్రీకరించడంతో పాటు రోడ్లు, విద్యుత్ సరఫరా, రవాణా, విద్యా రంగాలు మెరుగుపరిచిన నితీష్ ప్రజల మనసులు గెలిచారు. గత 20 ఏళ్ళుగా అప్రతిహతంగా ఆయన సీఎంగా కొనసాగుతున్నారు. రాజకీయాల్లో ఎటు తిరిగినా.. సీఎంగా మాత్రం ఆయనే ఉంటున్నారు. ఈసారి నితీశ్ వివిధ వర్గాల నుంచి విమర్శలను ఎదుర్కొంటున్నారు.అయితే ఇటీవల నితీశ్ ప్రభుత్వం కోటి మంది మహిళల ఖాతాల్లో రూ. 10,000 చొప్పున నగదు జమ చేసింది. ఇది గేమ్ ఛేంజర్ గా భావిస్తున్నారు. బీహార్ ప్రజల నాడిని నితీష్ పట్టారు. మరి ఈసారి.. సరిగా అంచనా వేస్తున్నారా? వయసు మీరిన కారణంగా తడబడతారా? అన్నది చూడాలి.

**తేజస్వికి యువతే బలం**

నితీశ్ ప్రధాన ప్రత్యర్థి తేజస్వి యాదవ్. తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీకి యాదవ్‌లు, ముస్లీంలు బలమైన, నమ్మకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. బీహార్‌లోని మొత్తం ఓట్లలో యాదవులు, ముస్లిం వాటా దాదాపు 30 శాతంగా ఉంది. ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ ఈసారి పోటీ చేయకపోతుండటంతో పార్టీ తేజస్విని నాయకుడిగా ప్రకటించింది. ఆయనకు వివాదరహితుడిగా పేరు ఉండటం ఎన్నికల్లో కలిసొచ్చే అంశం. నితీశ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో తేజస్వికి ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. ఆ సమయంలో ఆయన యువతలో మంచి గుర్తింపు సాధించారు. బీజేపీ ఓట్లను దొంగతనం చేసి ఎన్నికల్లో గెలుస్తూ వస్తోందని రాహుల్‌గాంధీ చేసిన ప్రచారం బీహార్ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపడం ఇండీ కూటమికి ఉన్న మరో బలంగా చెబుతున్నారు.

## ఇండీ కూటమి బలహీనతలు

ఇండీకూటమికి బలహీనతలు అనేకం ఉన్నాయి. ఆర్జేడీని ఎక్కువగా లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులే నియంత్రిస్తారు. వారిపై పలు అవినీతి కేసులు ఉన్నాయి. ఈడీ దర్యాప్తు చేస్తున్న ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం పార్టీకి మచ్చతెచ్చింది. ఇక తేజస్వి యాదవ్‌కు పార్టీ కేడర్‌లో మంచి ఆదరణ ఉన్నప్పటికీ ఆయన సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ వంటి లాలూ కుటుంబసభ్యుల నుంచి తరచూ విమర్శలు, అసంతృప్తి వ్యాఖ్యలు ఎదురవుతుంటాయి. ఫలితంగా తేజస్వి పార్టీని, కూటమి భాగస్వాములను నడపడం కంటే తన కుటుంబ వ్యవహారాలను చక్కదిద్దుకోవడంపైనే ఎక్కువ దృష్టి పెట్టవలసి వచ్చింది. ఇది పార్టీకి ఉన్న తీవ్రమైన బలహీనతగా చెప్పొచ్చు. ఆర్జేడీ అవకాశాల విషయంలో యువతరం ప్రధానపాత్ర పోషించే అవకాశం ఉంది. తేజస్వి లాంటి యువ నేత నాయకత్వంలో ఇండియా కూటమి యువతరాన్ని ఆకట్టుకోవచ్చు. ఎన్డీయేలో ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్ యాదవ్ ఈ అంశంలో వెనుకబడ్డారు. ఉద్యోగ కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చే వ్యక్తిగా నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తూ తేజస్వి యువతను ఆకర్షిస్తున్నారు. వలసలు, శాంతిభద్రతల సమస్యను లేవనెత్తడానికి ఆయన ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. గతంలో నితీశ్‌కుమార్ పార్టీతో ఆర్‌జేడీ సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్నప్పుడు కులగణన నిర్వహించి వెనుకబడిన వర్గాలకు కోటాను పెంచారు. ప్రస్తుతం నితీశ్ కుమార్ ఎన్డీఏలో ఉన్నప్పటికీ, ఓబీసీ, దళితుల మద్దతుతో కోటా పెంపు తమవల్లే సాధ్యమైందని ఆర్జేడీ చెప్పుకునే అవకాశం ఉంది. ఎప్పటి నుంచో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడుతోందన్న పేరు ఆర్జేడీకి ఉంది. కాంగ్రెస్, సహా వామపక్షాలు వంటి భావసారూప్యత కలిగిన పార్టీలతో పొత్తు ఆర్జేడీకి మేలు చేయనుంది. అలాగే నీతీశ్ కుమార్ ఎన్డీయేలో ఉండటం వల్ల ముస్లిం ఓట్లన్నీ గంపగుత్తగా ఆర్జేడీ, దాని మిత్రపక్షాలకే పడే అవకాశం ఉంది. చాలా కాలం ఆర్జేడీ అధికారంలో లేకపోవడం వల్ల, పార్టీలోని ప్రధాన నాయకులను ఉత్సాహపర్చడం కష్టంగా మారే అవకాశం ఉందని, ఎన్నికల సమయం వరకు కూటమిని ఐక్యంగా ఉంచడం ఆర్జేడీకి ప్రధాన సవాల్‌గా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కులాల ఎఫెక్ట్

బీహార్ లో కుల రాజకీయాల ప్రభావం అధికం. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా రాజకీయాలను కులాలు అత్యధికంగా ప్రభావితం చేసే రాష్ట్రం బీహార్. 2023 కుల గణన సర్వే ప్రకారం ఈ రాష్ట్ర జనాభా 13.07కోట్లు. అందులో అత్యధికంగా 63.13శాతం బీసీలే. అయితే బీహార్‌లో తీవ్ర వివాదం రేపుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకారం ఓటర్ల సంఖ్య 7.24కోట్లు. జనాభా ప్రకారం చూసుకుంటే బీసీ ఓటర్లు అత్యధికంగా ఉండే అవకాశం ఉంది. ఓబీసీల్లో యాదవుల జనాభా అత్యధికంగా 14.27శాతం ఉంది. దళితులు 19.65శాతం ఉండగా, అగ్ర కులాలు 15.52శాతం. ముస్లింల జనాభా 17.7 శాతం. సంప్రదాయ బద్ధంగా కులాల లెక్కనే పోలింగ్ జరుగుతూ వస్తున్న బీహార్‌లో అక్టోబర్-నవంబర్‌లో జరగబోయే ఎన్నికల్లో ఏం జరుగుతుందో చూడాలి.

## పీకే జన్ సురాజ్ ఎఫెక్ట్

వివిధ రాజకీయపార్టీలకు వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్ ఇపుడు బీహార్ రాజకీయాల్లో తెరంగేట్రం చేశాడు. గత ఏడాదిగా ఆయన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సందర్శించి ప్రజలతో నేరుగా సంభాషించారు. రాత్రిపూట గ్రామాల్లోనే బస చేశారు. నితీశ్, బీజేపీ, ఆర్జేడీలపై సమానంగా విమర్శలు గుప్పించారు. ఆయన పెద్ద సంఖ్యలో జనాన్ని ఆకర్షిస్తున్నారు. అయితే ఓట్లు, సీట్లే రాజకీయాల్లో ప్రధానం కాబట్టి.. ఈ ప్రభావాన్ని ఇప్పటికిపుడు చెప్పలేం. ప్రశాంత్ కిషోర్ ఎఫెక్ట్ మాత్రం బీహార్ రాజకీయాల్లో బలంగానే ఉండే అవకాశముంది. కూటముల్లో లుకలుకలు పీకే పార్టీకి ఇంధనంలా మారే అవకాశాలున్నాయి. టికెట్ దక్కనివారికి పీకే పార్టీ షెల్టర్ గా మారి బలోపేతం అయ్యే ఛాన్స్ ఉంది. నవంబర్ 14న బీహార్ ఫలితం తేలనుండగా, ఇక్కడి రాజకీయ ముఖచిత్రంగా దేశమంతా ఆసక్తి ఉంది. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో 121 స్థానాలకు నవంబర్ 6న ఎన్నికలు జరుగుతాయి. మిగిలిన 122 నియోజకవర్గాలకు నవంబర్ 11న ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుత అసెంబ్లీలో అధికార ఎన్డీఏకు 138 మంది సభ్యులు ఉండగా, ప్రతిపక్ష కూటమికి 103 మంది సభ్యులు ఉన్నారు.